## ఎమ్మెల్యే కృషితో హైమాస్ట్ లైట్లు



అంతర్గాంలో హైమాస్ట్ లైట్లు ప్రారంభిస్తున్న నాయకులు

తాంసి(భీంపూర్), మే 10 : బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కృషితో మండలంలోని ప్రతి గ్రామానికీ హైమాస్ట్ లైట్లు మంజూరయ్యాయి. శనివారం రాత్రి సరిహద్దు గిరిజన పంచాయతీలు కొజ్జన్‌గూడ, కరన్‌వాడి సహా అంతర్గాం, ఇందిరా నగర్‌లో హైమాస్ట్ లైట్లను బీఆర్ఎస్ నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

## అమర జవాన్‌కు నివాళి

ఉట్నూర్, మే 10 : అమరుడైన జవాన్ మురళీ నాయక్ చిత్రపటానికి ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాజీ జవానులైన శత్రుఘన్, వినాయక్‌ను శాలువాలతో సత్కరించారు. వెడ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు, యువతి, యువకులు పాల్గొన్నారు.

## హనుమాన్ ఆలయంలో పూజలు

ఉట్నూర్, మే 10 : తీవ్రవాద దేశమైన పాకిస్తాన్‌పై భారత సైన్యం విజయం సాధించాలని కోరుతూ శనివారం స్తానిక హనుమాన్ ఆలయంలో భక్తులు, నాయకులు రితేశ్ రాథోడ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, భక్తులున్నారు.

## ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా తిరంగా ర్యాలీ

ఎదులాపురం, మే 10 : భారత సైన్యం, ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా ఆదిలాబాద్ పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో భారీ తిరంగా ర్యాలీ శనివారం నిర్వహించారు. ఈ ర్యాలీలో ఎంపీ నగేశ్, ఎమ్మెల్యే పాయల్ శంకర్‌తోపాటు విద్యార్థులు పట్టణ ప్రజలు పాల్గొన్నారు. భారత్ దేశంలో అక్రమంగా నివసిస్తున్న వారిని వెంటనే వారి దేశాలకు తిరిగి పంపాలన్నారు. ఉగ్ర మూకలను శాశ్వతంగా నిర్మూలించాలని ఆకాంక్షించారు. సనాతన హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ కత్రి, నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## ముగిసిన ఉచిత వేసవి శిక్షణ శిబిరాలు

ఎదులాపురం, మే 10 : రెండు రోజులుగా ముంబాయి జిన్నింగ్ లోని ఇస్కాన్ ఆలయంలో కొనసాగుతున్న వేసవి శిక్షణ శిబిరం శనివారం ముగిసింది. ఇందులో పిల్లలకు ఆధ్యాత్మిక క్రీడలు, డ్రాయింగ్, పెయింటింగ్ తదితర వాటిపై శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణలో దాదాపు వంద మంది పిల్లలు హాజరయ్యారు. ముగింపు సందర్భంగా శ్రీకృష్ణుడి ప్రవచనాలతో పాటు గీతాలను ఆలపించారు. ఈ సందర్భంగా ఇస్కాన్ టెంపుల్ ప్రతినిధి ప్రణవనంద ప్రభుజీ మాట్లాడుతూ పిల్లలల్లో ఆధ్యాత్మికత, మేధస్సును పదును పెట్టడం, నైపుణ్యాలను పెంపొందించేలా శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు.

## రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు

ఉట్నూర్ రూరల్, మే 10 : మండలంలోని శ్యాంపూర్, దంతన్‌పెల్లి గ్రామాలలోని రైతు వేదికల్లో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని వ్యవసాయ శాఖ సహకారంతో సోమ, మంగళవారంలో నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయ అధికారి రమేశ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ కళాశాల నుంచి శాస్త్రవేత్తలు హాజరై రైతులకు నూతన వంగడాలు, అధిక దిగుబడి పొందేందుకు చేపట్టాల్సిన నూతన వ్యవసాయ సాంకేతిక పద్ధతులను రైతులకు వివరిస్తారని తెలిపారు. రైతుల తప్పకుండా హాజరు కాగాలరని పేర్కొన్నారు.

## రథోత్సవానికి ఎమ్మెల్యేకు ఆహ్వానం



ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న కమిటీ సభ్యులు, గ్రామస్తులు

బోథ్, మే 10 : మండలంలోని కౌఠ(బీ) గ్రామంలో ఈనెల 12న జరిగే శ్రీ గోవిందమాంబ, వీర బ్రహ్మేంద్ర స్వామి వారి రథోత్సవ కార్యక్రమానికి హాజరు కావాలని శనివారం ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌కు ఆహ్వాన పత్రికను ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వీర బ్రహ్మేంద్ర స్వామి ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## అందుబాటులో పత్తి విత్తన ప్యాకెట్లు

ఎదులాపురం, మే 10 : ఆదిలాబాద్ జిల్లాలో 263 విత్తన దుకాణాల్లో 854600 పత్తి విత్తన ప్యాకెట్లు వివిధ కంపెనీలకు చెందిన హైబ్రిడ్స్ అన్ని మండలాల్లో అందుబాటులో ఉన్నాయని జిల్లా వ్యవసాయ అధికారి జి.శ్రీధర్ స్వామి తెలిపారు. రైతులు సమీప డీలర్ వద్ద విధిగా రసీదు పొంది విత్తనాలను కొనాలని సూచించారు.

## బోథ్‌లో పీవీరావు జయంతి

బోథ్, మే 10 : బోథ్ మండల కేంద్రంలో మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షులు పివి రావు 76వ జయంతిని శనివారం నిర్వహించారు. చిత్రపటానికి పూజలు చేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బోథ్ మండల శాఖాధ్యక్షులు ఎల్కరాజు, కోశాధికారి బోడ లక్ష్మణ్, సురేందర్, ఊశన్న, రవి, రమేశ్, రాజు, భోజన్న పాల్గొన్నారు.

## గంజాయి సేవిస్తున్న ఇద్దరిపై కేసు

ఎదులాపురం, మే 10 : గంజాయి సేవిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేసి నోటీసులు జారీ చేశామని మావల ఎస్సై వీ.విష్ణువర్ధన్ తెలిపారు. శనివారం మావల పోలీస్ స్టేషన్ పరిధిలో పాలిటెక్నిక్ కళాశాల గ్రౌండ్‌లో భగత్ సింగ్ నగర్‌కు చెందిన షేక్ జహీర్, రణదీవ్ నగర్‌కు చెందిన బాన్సవాడే సంతోష్‌కు గంజాయి నిర్ధారణ టెస్ట్ చేయగా పాజిటివ్ వచ్చింది. దీంతో వారిపై కేసు నమోదు చేసి నోటీసులు జారీ చేశామని పేర్కొన్నారు.

## హనుమాన్ ఆలయంలో చోరీ

ఎదులాపురం, మే 10 : పట్టణంలోని తాంసి బస్టాండ్ సమీపంలోని గంజ్‌రోడ్ మార్వాడీ హనుమాన్ ఆలయంలో చోరి జరిగింది. ఆలయ నిర్వాహకులు సుమిత్ తెలిపిన వివరాల ప్రకారం..శనివారం ఉదయం 6 గంటలకు ఆలయకర్త రాజు పూజ కోసం వచ్చారు. అప్పటికే ఆలయం తాళం పగులగొట్టి ఉండడాన్ని గమనించారు. హనుమాన్ విగ్రహానికి అలంకరించిన కండ్లు, గద, ముఖంతో పాటు పార్వతి దేవి విగ్రహానికి ఉన్న కిరీటం, కండ్లు, గణేశ్ విగ్రహానికి ఉన్న కిరీటాలు కనిపించలేదు. వెండితో చేసిన వస్తువులు కావడంతో వాటిని తస్కరించినట్లు చెప్పారు. టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు వచ్చి డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీ చేశారు. చోరీకి గురైన వస్తువుల విలువ సుమారు రూ.40 వేల వరకు ఉంటుందని సీఐ సీహెచ్ కరుణాకర్‌రావు తెలిపారు.

**దొంగ అరెస్ట్..8 తులాల వెండి ఆభరణాలు స్వాధీనం**

ఆదిలాబాద్ పట్టణంలోని గంజ్ రోడ్ హనుమాన్ ఆలయంలో శుక్రవారం రాత్రి వెండి ఆభరణాల చోరీపై ఫిర్యాదు అందిన వెంటనే టూ టౌన్ పోలీసులు విచారణ చేపట్టారు. శనివారం రాత్రి మార్కెట్ యార్డ్ సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న భీంపూర్ మండలంలోని నిపాని గ్రామానికి చెందిన ఆత్రం దయానంద్‌ను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. అతని వద్ద 8 తులాల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నామని టూ టౌన్ సీఐ కరుణాకర్ రావ్ తెలిపారు.

# బాధ్యతగా విధులు నిర్వహించాలి

• నిర్మల్ జిల్లా ఎస్పీ జానకీ షర్మిల



వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఎస్పీ జానకీ షర్మిల

నిర్మల్ అర్బన్, మే 10 : పోలీసులు విధుల్లో సమయపాలన పాటిస్తూ బాధ్యతగా నిర్వహించాలని నిర్మల్ జిల్లా ఎస్పీ జానకీ షర్మిల అన్నారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయం నుండి పోలీస్ సిబ్బందితో ఆన్‌లైన్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. విధుల పరంగా ఎలాంటి సమస్యలున్నా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని నీతి నిజాయితీతో పని చేసే వారికి శాఖలో ఎల్లప్పుడూ ప్రత్యేక గుర్తింపు ఉంటుందన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఏఎస్పీలు అవినాష్, రాజేశ్ మీనా, సీఐలు, ఎస్ఐలు తదితరులున్నారు.

## మైనర్ డ్రైవింగ్‌పై తనిఖీలు

• ఏఎస్పీ రాజేశ్ మీనా



మైనర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఏఎస్పీ రాజేశ్ మీన

నిర్మల్ అర్బన్, మే 10 : జిల్లాలో రోడ్డు ప్రమాదాలను పూర్తిగా నివారించేందుకే నిర్మల్ ఎస్పీ జానకీ షర్మిల ఆదేశాల మేరకు మైనర్ డ్రైవింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించామని ఏఎస్పీ రాజేశ్ మీన అన్నారు. శనివారం నిర్మల్ పట్టణంతో పాటు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో మైనర్ డ్రైవింగ్‌పై ప్రత్యేక తనిఖీ చేసినట్లు తెలిపారు. నిర్మల్ పట్టణంలో 10 మందిపై మైనర్ డ్రైవింగ్ కేసులను నమోదు చేయగా జిల్లా వ్యాప్తంగా 70 మైనర్ డ్రైవింగ్ కేసులు నమోదు కాగా మైనర్లు, తల్లిదండ్రులతో కలిసి 107 మందికి కౌన్సెలింగ్ నిర్వహించి మైనర్ డ్రైవింగ్‌తో కలిగే అనర్థాలు శిక్షలపై వివరించారు. ఈ కార్యక్రమంలో భైంసా ఏఎస్పీ అవినాష్, నిర్మల్ పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ అన్ని పోలీస్ స్టేషన్ల ఎస్ఐలు పాల్గొన్నారు.

## దాబాల్లో తనిఖీలు

భైంసా, మే, 10 : భైంసా పట్టణంలోని పలు దాబాలలో పోలీసులు శనివారం తనిఖీలు నిర్వహించారు. దాబాల్లో అక్రమంగా మద్యం విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ గౌస్ హెచ్చరించారు.



దాబాలో తనిఖీ చేస్తున్న పట్టణ ఎస్ఐ గౌస్

## వాహనాలు నడిపిన మైనర్లు..తండ్రులపై కేసులు

ఎదులాపురం, మే10: కౌన్సెలింగ్ ఇచ్చి హెచ్చరించినప్పటికీ మైనర్లకు వాహనాలు ఇచ్చినందుకు రెండు వేర్వేరు పోలీస్ స్టేషన్లలలో తండ్రులపై కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి తెలిపారు. శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను వెల్లడించారు. గత వారం జిల్లా వ్యాప్తంగా 295 మంది మైనర్లు నడిపిన వాహనాలను వారం పాటు తాత్కాలికంగా జప్తు చేసి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ చేశామన్నారు. ఆ తర్వాత శుక్రవారం రాత్రి ఆదిలాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్, ఆదిలాబాద్ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఇద్దరు మైనర్లకు వాహనాలు ఇచ్చిన తండ్రులపై వేరువేరుగా రెండు కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఇందులో టౌన్ పోలీస్‌స్టేషన్‌లో 17 సంవత్సరాల మైనర్ యువకుడికి తండ్రి వేణుగోపాల్‌పై 125 బీఎన్ఎస్ సెక్షన్ ప్రకారం క్రైమ్ నంబర్ 224/25 తో కేసు నమోదు చేశామన్నారు. రూరల్ పోలీస్ స్టేషన్ నందు నర్సయ్య, తన కొడుకు 12 సంవత్సరాల వ్యక్తికి వాహనాన్ని ఇచ్చి నందున పొచ్చర గ్రామం వద్ద వాహనాన్ని సీజ్ చేసి ఇచ్చిన తండ్రి నరసయ్యపై 125 బీఎన్ఎస్ సెక్షన్ ప్రకారం క్రైమ్ నంబర్ 138/25తో కేసు నమోదు చేశామని తెలిపారు. మైనర్లు వాహనాలు నడిపితే ప్రమాదాలు జరుగుతాయనే విషయాన్ని గమనించి తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలివ్వకుండా ఉండాలని సూచించారు. డ్రైవింగ్ లైసెన్సను వచ్చిన తర్వాతనే రోడ్లపై వాహనాలు నడపాలని సూచించారు.

## అకొండపేట పాఠశాల విద్యార్థుల ప్రతిభ

దస్తురాబాద్, మే 10 : గురుకుల ప్రవేశ పరీక్షలో ప్రతిభ చూపి 4వ తరగతి, 5వ తరగతి విద్యార్థులు సీట్లను సాధించారని ఆకొండపేట పాఠశాల హెచ్ఎం భాస్కర్ తెలిపారు. ఇటీవలె వెలుడిన ఎంపిక జాబితాలో తమ పాఠశాలకు చెందిన 8 విద్యార్థుల పేర్లు ఉన్నట్లు తెలిపారు. సాహిత్య, శ్రీనిధి, ప్రతిమ, విఘ్నేశ్, అభినయ శ్రీ, అలాగే 6వ తరగతికి అనితేజ్, సహస్ర, శ్రీతేజ సీట్‌ను సాధించినట్లు పేర్కొన్నారు. సీట్లను సాధించిన విద్యార్థులను హెచ్ఎం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

## ఆధునిక వ్యవసాయంపై దృష్టి పెట్టాలి



నీలగిరి మొక్కల పెంపకంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

దస్తురాబాద్, మే 10: రైతులు అధునిక వ్యవసాయంపై దృష్టి సారించాలని ఏఈవో తిరుపతి అన్నారు. శనివారం మండలానికి చెందిన పలువురు రైతులను జేకే కంపెనీ సహకారంతో విజ్ఞాన విహారయాత్రకు తీసుకువెళ్లారు. ఇందులో ఆసిఫాబాద్ జిల్లాలోని సిర్పూర్ పేపర్ మిల్లును సందర్శించారు. సందర్భంగా రైతులు అక్కడి ఎస్‌పీఎం అధికారులు రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పించారు. నీలగిరి, సుబాబులు, సరుగుడు మొక్కల పెంపకం వాటి ద్వారా వచ్చే ఆదాయాన్ని వివరించారు. కాగితపు తయారీకి ఉపయోగపడే మొక్కల పెంపకం తక్కువ సమయంలో ఎక్కువ లాభం పొందవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు దేవ్‌రాజ్, శ్రీధర్, శ్రీకాంత్, రైతులు మల్లయ్య, పెద్దన్న, ప్రవీణ్‌లింగన్న తదితరులు ఉన్నారు.

## ఆయిల్ పామ్ సాగుపై అవగాహన

లోకేశ్వరం, మే, 10 : మండలంలోని పంచగుడి గ్రామంలో శనివారం ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఉద్యాన, పట్టు పరిశ్రమశాఖ అధికారులు మాట్లాడుతూ ఆయిల్ పామ్ నాటుకునే రైతులందరూ ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్ రావు, మాజీ సర్పంచ్‌లు, రైతులు ఉన్నారు.

## ఆలయాల అభివృద్ధికి బీఆర్ఎస్ కృషి

• బీఆర్ఎస్ నిర్మల్ జిల్లా సమన్వయకర్త కొరిపెల్లి రాంకిషన్‌రెడ్డి

సోన్, మే 10 : ఆలయాల అభివృద్ధికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతగానో కృషి చేసిందని బీఆర్ఎస్ నిర్మల్ జిల్లా సమన్వయకర్త కొరిపెల్లి రాంకిషన్‌రెడ్డి గుర్తు చేశారు.నిర్మల్ మండలంలోని భాగ్యనగర్ గ్రామంలోని లక్ష్మీ నర్సింహస్వామి ఆలయంలో శనివారం బీఆర్ఎస్ నిర్మల్ జిల్లా సమన్వయకర్త కొరిపెల్లి రాంకిషన్‌రెడ్డి పూజలు చేశారు. వేద పండితులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ మహేశ్‌రెడ్డి, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఆత్మహత్యకు యత్నించిన మహిళను కాపాడిన కానిస్టేబుల్



ఆత్మహత్యకు యత్నించిన మహిళ తో పోలీసులు

బాసర, మే 10 : బాసర గోదావరి నదిలో దూకి ఆత్మహత్యకు యత్నించిన మహిళను శనివారం కానిస్టేబుల్ మోహన్‌సింగ్ కాపాడారు. నిజామాబాద్‌కు చెందిన తారా దేవి కూతురు ప్రేమవివాహం చేసుకోగా ఇప్పుడు వరకట్నం కోసం వేధిస్తున్నాడని, దీంతో తన కూతురుపై ఎవరికి చెప్పుకోవాలో తెలియక, ఎవరి అండ లేకపోవడంతో మనస్తాపానికి గురైన తారాదేవి ఆత్మహత్య చేసుకోడానికి శనివారం గోదావరి నది వద్దకు వచ్చింది. అక్కడే విధుల్లో ఉన్న కానిస్టేబుల్ మోహన్‌సింగ్ గమనించి వెంటనే ఆమెను పోలీస్‌స్టేషన్‌కు తరలించి కౌన్సెలింగ్ ఇచ్చారు.

## వరిధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

సారంగాపూర్, మే 10 : మండలంలోని స్వర్ణ గ్రామంలో శనివారం ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ అబ్దుల్‌హాది ప్రారంభించారు. ఐకేపీ ఏపీఎం మాధురి, సీసీ విఘ్నేష్, నాయకులు రవి, రైతులు పాల్గొన్నారు.

## పాఠశాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి



పొన్నారి హైస్కూల్‌లో ధ్వంసమైన నల్లాలు

తాంసి, మే 10 : మండలంలోని పొన్నారి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరారు. వేసవి సెలవుల నేపథ్యంలో గుర్తు తెలియని వ్యక్తులు పాఠశాల ఆవరణలోకి ప్రవేశించి డ్రింకింగ్ వాటర్ నల్లాలను ధ్వంసం చేశారు. ఇటీవల విద్యుత్ పరికరాలను కూడా పగులగొట్టినట్లు వెల్లడించారు. ఈ దుర్ఘటనలపై గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. అధికారులు స్పందించి పాఠశాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరారు.

## ఇందిరమ్మ కమిటీలు రద్దు చేయాల్సిందే

• బీఆర్ఎస్ నియోజకవర్గ సమన్వయకర్త డా.కిరణ్ కొమ్రెవార్

కుభీర్, మే 10 : పేదలకు ఇండ్లు ఇస్తామని చెప్పి పార్టీ కార్యకర్తలు, పార్టీకి అనుకూలంగా ఉన్న వారికే ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తున్నారని, వెంటనే ఇందిరమ్మ కమిటీలు రద్దు చేయాలని బీఆర్ఎస్ ముథోల్ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ కిరణ్ కొమ్రెవార్ పేర్కొన్నారు. శనివారం ఆయన మండలంలోని నిగ్వ గ్రామంలో మాట్లాడుతూ పేదలకు ఇండ్లు మంజూరు చేయడం లేదని, అందుకే ఇందిరమ్మ కమిటీలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వలేదంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. లేదంటే పేదల పక్షాన ప్రభుత్వంపై రాజీ లేని పోరుకు సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ దొంతుల దేవీదాస్, తోట చింటు, మహేశ్ తదితరులు ఉన్నారు.

## బాసర ఆర్జీయూకేటీలో వనమహోత్సవం

బాసర, మే 10 : బాసర ఆర్జీయూకేటీలో శనివారం వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా వైస్ ఛాన్సలర్ గోవర్ధన్ విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐక్యరాజ్య సమితి స్థాపించిన సస్టయినబుల్ డెవలప్‌మెంట్ గోల్స్ లోని ఎస్‌డీజీ 13 క్లైమేట్ యాక్షన్, ఎస్‌జీడీ 15 లైఫ్ ఆన్ ల్యాండ్ లక్ష్యాలను చేరుకోవడానికి తోడ్పడే విధంగా ఆర్జీయూకేటీ బాసరలో బీ 19 బ్యాచ్ విద్యార్థులు ఆగస్టు 10, 2025 ప్రాజెక్టు వసుంధర కింద ప్రత్యేక వనమహోత్సవం, క్యాంపస్ శుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల ద్వారా పచ్చదనంపై ఉన్న బాధ్యతను, భవిష్యత్ తరాలకు ఒక వారసత్వాన్ని అందజేస్తుందని తెలిపారు. ఆర్జీయూకేటీ విద్యార్థులలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంచడంతో ఇది తోడ్పాటునిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో క్యాంపస్ బ్యూటిఫికేషన్ కమిటీ కన్వీనర్ జీ. శ్రీనివాస్, విద్యార్థులున్నారు.



మొక్కలు నాటుతున్న వీసీ, విద్యార్థులు



గూడ్స్ వాహనంలో పరిమితికి మించి వెళ్తున్న ప్రయాణికులు

## ప్రయాణం..ప్రమాదం

రోడ్డు ప్రమాదాల నివారణకు అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్న ప్రజలు ఇష్టానుసారంగా ప్రయాణాలు కొనసాగిస్తున్నారు. వాహనాల డ్రైవర్లు సైతం కనీస నిబంధనలు పాటించకుండా ప్రమాదకర స్థితిలో జనాలను వాహనాల్లో ఎక్కించుకుని తీసుకుపోతున్నారు. శనివారం బేల– జైనథ్ రహదారిపై బొలేరో వాహనంలో పలువురు కూలీలు ప్రమాదకర పరిస్థితుల్లో ప్రయాణించిన దృశ్యం 'నమస్తే' కెమరాకి చిక్కింది.

- ఫొటో గ్రాఫర్, నమస్తే తెలంగాణ

## అబుదాబి జైలు నుంచి నా భర్తను విడిపించండి

• ప్రభుత్వానికి బాధితుడి భార్య వినతి




మాట్లాడుతున్న బాధితుడి భార్య మంజుల

నిర్మల్ అర్బన్, మే 10 : అబుదాబి దేశంలో జైలులో ఉన్న తన భర్త సాయన్నను విడిపించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూ పాత్రికేయుల ఎదుట బాధితుడి భార్య మంజుల గోడు వెల్లబోసుకుంది. శనివారం నిర్మల్ ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను ఎన్నారై అడ్వయిజరీ కమిటీ మెంబర్ స్వదేశీ పరికిపండ్ల వెల్లడించారు. కుంటాల మండలం అంబకంటి గ్రామానికి చెందిన కుర్మె గజకా రెడ్డి సాయన్న ఉపాధి నిమిత్తం గతేడాది అబుదాబి దేశానికి వెళ్లాడు. అక్కడ లేబర్ పని చేస్తుండగా గత నెల 16న అక్కడి పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు పంపించారు. నిరక్షరాస్యుడైన సాయన్న పేరుతో ఎవరో రుణం తీసుకొని కట్టకుండా మోసం చేయడంతో జైలు పాలయ్యాడని తెలిపారు. అమాయకుడైన తన భర్తను విడిపించాలని భార్య మంజుల వేడుకున్నది. ఈ సమావేశంలో కొడుకు సాయి కుమార్, కుటుంబసభ్యులు తదితరులున్నారు.

## డా.కిరణ్‌కుమార్‌కు ఉత్తమ సేవా పురస్కారం



మంత్రుల చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న డా. కిరణ్‌కుమార్

ఖానాపూర్ టౌన్, మే 10 : ఖానాపూర్ పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ కిరణ్ కుమార్‌కు ఉత్తమ సేవ పురస్కారం దక్కింది. 25 ఏళ్లుగా వైద్య వృత్తిలో ఉంటూ ఖానాపూర్ పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు వైద్య సేవలు అందించడమే కాకుండా సామాజిక సేవ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నందుకు ఆయనకు పురస్కారం దక్కింది. ఈ మేరకు శుక్రవారం రాత్రి హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, సీతక్కల చేతుల మీదుగా ఆయన అవార్డు అందుకున్నారు. అవార్డు రావడంపై ఖానాపూర్ పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

## నిజాయితీ చాటుకున్న కండక్టర్



ల్యాప్‌టాప్ బ్యాగును అందజేస్తున్న కండక్టర్ ఉదయ్

నిర్మల్ అర్బన్, మే 10 : నిర్మల్ నుంచి శంషాబాద్ వెళ్లే ఆర్టీసీ బస్సులో శ్రీనివాస్ అనే ప్రయాణికుడు ల్యాప్ టాప్‌ను బస్సుల్లోనే వదిలి సౌదీ అరేబియా వెళ్లిపోయాడు. ప్రయాణికుడు మర్చిపోయిన బ్యాగ్‌ను గమనించిన కండక్టర్ ఉదయ్ రిజర్వేషన్ టికెట్ ఆధారంగా కుటుంబ సభ్యుల వివరాలు తెలుసుకుని తిరుగు ప్రయాణంలో శనివారం ఆర్మూర్ బస్టాండ్ వద్ద స్టేషన్ మేనేజర్ నారాయణ, గోపి సమక్షంలో కుటుంబ సభ్యులకు అందజేశారు. విధి నిర్వహణలో నిజాయితీ చాటుకున్న కండక్టర్ ఉదయ్‌ను నిర్మల్ డిపో మేనేజర్ పండరి అభినందించారు.

## విద్యుత్ ప్రమాదాలపై అవగాహన



నిపానిలో ముగింపు కార్యక్రమంలో సిబ్బంది

తాంసి(భీంపూర్), మే 10 : రైతులు, వినియోగదారులు వర్షాకాలం సహా అన్ని సమయాల్లో విద్యుత్ ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఏఈ తిరుపతి రెడ్డి సూచించారు. భీంపూర్ మండలంలోని నిపాని, అర్లి(టీ) సబ్ స్టేషన్‌ల్లో శనివారం విద్యుత్ భద్రత వారోత్సవాలు నిర్వహించారు. పోస్టర్లు ప్రదర్శించారు. కార్యక్రమంలో ఏఈ శ్రావణ్‌కుమార్, సిబ్బంది అనిల్, శౌకల్ అలీ, రవీందర్, మోహన్ పాల్గొన్నారు.

## సాగు పనులు ప్రారంభం

భీంపూర్, మే10: ఇక వర్షాకాలం ఎంతో దూరంలో లేనందున మండల రైతులు ఇక వానాకాలం సాగుకు సిద్ధమవుతున్నారు. పంటలు తీసిన భూముల్లో ట్రాక్టర్లు, నాగళ్లతో దుక్కులు దున్నుతున్నారు. ఇప్పటికే మార్కెట్‌లో పత్తి విత్తనాలు లభ్యం అవుతున్నందున నాణ్యమైన విత్తనాలు తీసుకుని వెళ్తున్నారు. ఇదిలాఉంటే ఈ సారి సర్కారు అందరికీ రైతుబంధు ఇవ్వక మళ్లీ దళారులు, వడ్డీ వ్యాపారుల దగ్గరికి వెళ్లే పరిస్థితి వచ్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## అటవీ భూములు దున్నితే చర్యలు



భూములను పరిశీలిస్తున్న సీసీఎఫ్ శాంతారాం, అధికారులు

కోటపల్లి, మే 6 : అటవీ భూములు దున్నితే చర్యలు తప్పవని సీసీఎఫ్ శాంతారాం హెచ్చరించారు. కోటపల్లి మండలం పిన్నారం గ్రామంలో అటవీ అధికారులు ఇటీవల రైతుల ఇండ్లకు వెళ్లి అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని బీజేపీ నాయకులు ఫారెస్ట్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా, శనివారం సీసీఎఫ్ శాంతారాం అటవీ భూములను సందర్శించారు. హక్కు పత్రాలు ఉన్నవారే అటవీ భూములు సాగు చేయాలని సూచించారు. ఇతరులు దన్నితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ఇద్దరు అరెస్ట్

మంచిర్యాల అర్బన్, మే 10 : పీడీఎస్ బియ్యంతో పట్టుబడిన మంచిర్యాలలోని ఎన్టీఆర్ నగర్‌కు చెందిన చింతల మోసెస్, పాస్తం నరేశ్‌ను శనివారం అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు మంచిర్యాల పట్టణ సీఐ ప్రమోద్ రావు తెలిపారు. మంచిర్యాల రాంనగర్‌లో పీడీఎస్ రైస్ ఉన్నట్లు వచ్చిన సమాచారం మేరకు తనిఖీ చేశామని పేర్కొన్నారు. మోసెస్ ఇంటి ఆవరణలో ఉన్న బొలేరో వాహనంలో దాచి ఉంచిన 35 క్వింటాళ్లు, అలాగే పాస్తం నరేశ్ ఇంటి వద్ద టాటా మ్యాజిక్‌లో దాచి ఉంచిన 15 క్వింటాళ్ల బియ్యం గుర్తించినట్లు తెలిపారు. ఇద్దరినీ శనివారం పట్టుకున్నట్లు పేర్కొన్నారు. పీడీఎస్ బియ్యం విక్రయించినవారిపై ప్రభుత్వపరంగా చర్యలు తీసుకోనున్నట్లు సీఐ వెల్లడించారు.

## తనయుడి చేతిలో తండ్రి హతం

లోకేశ్వరం, మే, 10 : తనయుడి చేతిలో తండ్రి హతమైన ఘటన శనివారం లోకేశ్వరం మండలం రాజురా గ్రామంలో జరిగింది. రాజురా గ్రామానికి చెందిన గన్నారం భూమన్న (80) పెద్ద కుమారుడు భూమన్న అతని భార్య సంవత్సరం క్రితం ఇంట్లో నుంచి పుట్టింటికి వెళ్లింది. అప్పటి నుంచి తండ్రి కొడుకులే ఇంట్లో ఉంటున్నారు. తనను బాగా చూసుకుంటలేవని కుమారుడితో తండ్రి భూమన్న అనడంతో నివారం ఉదయం 5.30 గంటల సమయంలో గొడవ జరిగింది. తండ్రి తలపై కుమారుడు రోకలి దుడ్డుతో కొట్టి చంపేశాడు. ఈ విషయం అతని చెల్లి సుజాతకు ఫోన్ చేసి చెప్పగా ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఘటనా స్థలాన్ని భైంసా ఏఎస్పీ అవినాశ్ కుమార్, ముథోల్ సీఐ మల్లేశ్, ఎస్ఐ అశోక్ కుమార్ సందర్శించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## బైక్‌పై నుంచి పడి మహిళ మృతి

లోకేశ్వరం, మే, 10 : లోకేశ్వరం మండలంలో కల్లూర్‌కు చెందిన పసుల గోదావరి (40) బైక్‌పై నుంచి పడి శనివారం మృతి చెందింది. తమ్ముడి కూతు రు పెళ్లి ఉన్నదని ఈ నెల 6న పిప్రి గ్రామని కి భర్త పసుల సాయన్నతో గోదావరి వెళ్లింది. శనివారం ఉదయం బైక్‌పై తిరిగి వస్తుండగా హవర్గా గ్రామ సమీపంలోని శ్మశాన వాటిక దగ్గర మృతురాలు కళ్లు తిరిగి బైక్ పై నుంచి పడిపోయింది. భైంసా దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి తమ్ముడు దాస శేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## ట్రాక్టర్‌పై నుంచి పడి..

బోథ్, మే 10 : బోథ్ సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యవసాయ కూలీ మృతి చెందాడు. ఎస్ఐ ప్రవీణ్ తెలిపిన వివరాల ప్రకారం.. పింగడి దత్తు (47) పొలంలో కూలి పనులకు వెళ్లి తిరిగి వస్తున్నాడు. బోథ్ వైపు జొన్నల లోడుతో వస్తున్న ట్రాక్టర్‌ను ఆపి ఎక్కాడు. ట్రాక్టర్‌పై నుంచి పడిపోవడంతో ట్రాలీ అతని ముఖంపై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

## యువకుడి అదృశ్యం

ఎదులాపురం, మే 10 : ఆదిలాబాద్ పట్టణంలోని భుక్తాపూర్‌కు చెందిన అశోక్ కుమార్ (20) అదృశ్యమైనట్లు వన్ టౌన్ సీఐ బీ.సునీల్ కుమార్ తెలిపారు. ఈ నెల 4న ఇంట్లో చెప్పకుండా ఎక్కడికో వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యుడు దేవసి ప్రగరం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

FINANCIAL SERVICES

★Sharing-Properties available for Private Finance and Bank Loans around Hyderabad. Visit at KPHB Office. Ph: 7032631468.

NT-336491-All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679

నిర్మల్: 91827 77671, 91827 77677